# తిరపతి

కాకాని కమల

''పాత పేపర్లు కొంటాం... పాల కవర్లు కొంటాం... పాత ప్లాస్టిక్ సామాన్లు కొం...''
వీధిలో కేక విని మేడమీది పోర్షన్‌లో వుండే రామలక్ష్మి గబగబా బాల్కనీలోకి వచ్చి ''ఓ పేపరబ్బాయి...'' అంటూ ఓ పొలికేక పెట్టింది.

పెద్ద బుట్టలో గోనెసంచి పెట్టుకుని సైకిల్‌మీద పోతున్న పేపరు కుర్రాడు సైకిల్ స్లోచేసి వెనక్కి తిరగ్గానే బాల్కనీ పిట్ట గోడమీంచి మరికొంత ముందుకి వంగి ''ఇటురా'' అంటూ చెయ్యి ఊపింది.

వాడు ఇంటిముందు సైకిల్ ఆపుచేసి మెట్లెక్కి వస్తుంటే కింది పోర్షన్‌లో వున్న రుక్మిణమ్మ కూడా ఇంట్లోంచి బయటకు వచ్చి ''అక్కడ అయ్యాక ఇటు రా అబ్బి. పాల కవర్లు వున్నాయి'' అంటూ బాల్కనీలో వున్న రామలక్ష్మికేసి చూస్తూ ''ఏంటి వదినా! తెగ హడావుడిగా కనిపిస్తున్నారు రెండురోజుల నుంచి'' అంది నవ్వుతూ.

''ఈవారం అంతా హడావుడే వదినా. మీ అన్నయ్యగారికి పై ఆఫీసర్‌గా ప్రమోషన్ వచ్చిందికదా. వచ్చిపోయేవాళ్లు. చూస్తున్నావుకదా. పైగా రెండునెలల్లో ఆయనకు ట్రాన్స్‌ఫర్ వుంటుందిట. అందుకని తిరుపతి వెళ్తున్నాం వదినా ఇంటిల్లిపాదిమి'' అంది.

''ఎప్పుడు?''

''ఎల్లుండి సోమవారం తిరుపతి వెళ్తున్నాం. మీ అన్నగారికి మద్రాస్‌లో వారంరోజులపాటు ట్రైనింగ్ ఇచ్చారు. వచ్చే మంగళవారం నుంచి పై మంగళవారం దాకా ట్రైనింగ్. హోటల్ రూముకి ఆయన ఆఫీస్ ఇస్తుంది. సరే ఎలాగూ హోటల్ రూము ఖర్చు, భోజనం ఖర్చు ఆఫీసే పెట్టుకుంటుందికదా? సరే పిల్లలు సరదా పడుతున్నారని అందరం బయలుదేరాం వదినా. వారం రోజులు మద్రాస్‌లో వుండి అన్నీ చూసుకుని బుధవారం తిరుపతికి వెళతాం. అక్కడ రెండురోజులుండి తీరిగ్గా వచ్చేస్తాం వదినా. పిల్లలకి ఆరునెల్ల పరీక్షలు అయిపోయాయికదా అని ప్రయాణం పెట్టుకున్నాం''

''పోన్లే వెళ్లిరండి. మీవారు పెద్ద ఆఫీసర్ అయ్యాక కూడా ఆమాత్రం సరదా లేకపోతే ఎలా? అయినా నీకేం తక్కువ వదినా?'' కడుపులో మంటగా వున్నా పైకి పొగిడింది రుక్మిణమ్మ.

లోపల్నుంచి బక్కెట్టు నిండా దాచిన పాల కవర్లు తెచ్చి పేపరు కుర్రాడి ముందు పెట్టింది.

''అయితే ట్రాన్స్‌ఫర్ అయితే మీరు వెళ్లిపోతారన్నమాట''

''ట్రైనింగ్ అవగానే ఆయనకి ట్రాన్స్‌ఫర్ వుంటుంది వదినా. ముందే ఆయన వెళ్లి ఇల్లు అది చూసి పెడతారు. పిల్లల పెద్ద పరీ క్షలు అయ్యాక మేం అంతా వెళతాం. అంత వరకూ శనా దివారాలు ఆయ న వచ్చి వెడతారు''

''పాల కవర్లు మూడువం దల పాతిక వున్నాయమ్మా'' అన్నాడు.

''సరిగ్గా చూసావా?'' అంది రామలక్ష్మి. ముందే ఆమె లెక్క పెట్టి వుంచుకున్నవే.

''ఆ! సరిగ్గానే చూశానమ్మా'' అన్నాడు.

ఆ పాత పుస్తకాలు తెచ్చి ముందర పెట్టింది.

''అయితే తిరుపతి ప్రయాణం ఎప్పుడు?'' అడిగింది రుక్మిణమ్మ.

''సోమవారం వదినా. మంగళవారం ఆయన మద్రాస్‌లో ట్రైనింగ్‌కి వుండాలిట'' అంది.

''అయితే మొత్తం ఓ పదిరోజుల ట్రిప్పన్నమాట''

''అవునొదినా''

''అయితే ఇంకేం. ఓ పదిరోజులు నీకు వంట పని తప్పిపోయినట్టే. సుఖమే సుఖం'' రుక్మిణమ్మ ఉబ్బేసింది.

రామలక్ష్మి ముసిముసిగా నవ్వింది.

''పదిరోజులు హోటలు భోజనం కదా వదినా. అందుకే పిల్లలకి చిరుతిళ్లు కూడా తీసకువెళ్తున్నాం. పచ్చళ్లు, పొళ్లు కూడా మారుతున్నాను''

''అన్నీ వుండాలిలే వదినా. కానీ మరీ విలువైన



వస్తువులేవీ తీసుకెళ్లకండి. హోటలు గదుల్లో దొంగతనాలు జరుగుతాయి. తిరుపతిలోనూ దొంగలు ఎక్కువే''

''తెలుసొదినా. అందుకే ముఖ్యమైన బట్టల లగేజీ తీసుకువెళ్తున్నాం. నగలు అన్నీ ఇక్కడే వుంచేస్తున్నాం'' అంది రామలక్ష్మి.

పాత కాగితాలు, పాల కవర్ల డబ్బు మూడు పదులదాకా రామలక్ష్మి చేతిలో పెట్టి బుట్ట తీసుకుని కిందకి వచ్చాడు పాత పేపర్ల కుర్రాడు.


కింద రుక్మిణమ్మ ఇచ్చిన పాల కవర్లు కూడా తీసుకుని సైకిలెక్కి వెళ్లిపోయాడు పాత పేపర్ల కుర్రాడు.

రుక్మిణమ్మ పాల కవర్లు ఇస్తుంటే ఆ సందడికి ఎదురింటి సుందరి, పక్కింటి కామాక్షి కూడా వచ్చారు. మధ్యాహ్నం పన్నెండు గంటల సమయం కావడంతో ఆడాళ్లందరికీ అది తీరిక వేళ. అందరితోటి

తన భర్త ప్రమోషన్ గురించి, తిరుపతి ప్రయాణం గురించి చెప్పింది రామలక్ష్మి.

పాత పేపర్ కుర్రాడు వెళ్ళాక కూడా అంతా కలిసి ఓ గంటసేపు హస్కు వేసి పన్లు ఉన్నాయంటూ ఎవరిళ్లకు వాళ్లు వెళ్లిపోయారు. పిల్లలు స్కూల్ నుంచి వచ్చే వేళయిందని రామలక్ష్మి కూడా పైకి వచ్చేసింది.

★★★



రుక్మిణమ్మ రామలక్ష్మి వుండే ఇల్లు రెండు పోర్షన్ల మేడ. కింద రుక్మిణమ్మ భర్త ముగ్గురు పిల్లలు వుంటారు. వెయ్యి రూపాయలు అద్దె. పైన రామలక్ష్మి భర్త ముగ్గురు పిల్లలతో వుంటారు. అద్దె వెయ్యి. ఇంటివాళ్లు పక్క వీధిలో వుంటారు. రుక్మిణమ్మ భర్త, రామలక్ష్మి భర్త గవర్నమెంటు ఉద్యోగస్థులు. రామలక్ష్మి భర్త ఓ మెట్టు పై అధికారి.

★★★

అనుకున్న ప్రకారం సోమవారంనాడు రామలక్ష్మి, భర్త పార్థసారధి, పన్నెండేళ్ల కొడుకు శ్రీనివాస్, పదేళ్ల కొడుకు శివ, ఎనిమిదేళ్ల కూతురు వైదేహి అంతా మద్రాస్ వెళ్లారు. వెళ్లేముందు ఇంటికి, మెట్ల తలుపుకు తాళంవేసి కింద రుక్మిణమ్మని కాస్త ఇల్లు చూస్తూ వుండమని చెప్పి ఆనందంగా వెళ్లిపోయింది రామలక్ష్మి.

★★★

దాదాపు పదిహేనురోజుల తరువాత రామలక్ష్మి కుటుంబం మద్రాస్, తిరుపతి యాత్ర ముగించుకుని సికింద్రాబాద్ స్టేషన్‌లో ఉదయాన రైలు దిగి అక్కడ్నుంచి ఆటోలు మాట్లాడుకుని ఇంటిముందు దిగారు.

రామలక్ష్మి, భర్త, ముగ్గురు పిల్లలు అంతా గుళ్లు. తిరుపతిలో జుట్టు ఇచ్చారు. అంతా టోపీలు పెట్టుకున్నారు. భర్తకి పై ఆఫీసరు ఉద్యోగం వచ్చిందన్న ఆనందంతో అప్పటికప్పుడు ''ఎందుకో నాకు స్వామికి నీలాలు ఇవ్వాల నుందండి'' అంది భక్తి పారవశ్యంగా.

''నీ ఇష్టం'' అన్నాడు పార్థసారధి. వాళ్ల ఇంటిల్లిపాది వెంకటేశ్వరుడి భక్తులు. రామలక్ష్మి కూడా గుండు చేయించుకుని అక్కడే ఒక విగ్గు కొనుక్కుని పెట్టుకుంది.

వీళ్లు ఇంటికి వచ్చేసరి కి ఇంకా రుక్మిణమ్మ వాళ్లు లేవలేదు. పూర్తిగా తెల్లారలేదు.

అందరికంటే ముందు ఆటో దిగిన రామలక్ష్మి మెట్ల తలుపు తాళం తీసి బాల్కనీలోకి వచ్చి వీధివైపు వేసిన తాళం తీసి ఇంట్లోకి అడుగుపెట్టి ట్యూబ్‌లైట్ వేసింది.

లైటు వేస్తూనే షాక్ కొట్టినట్టు వెర్రికేక పెట్టింది. అలాగే వెర్రికేకలు పెడుతూ ఇల్లంతా పరుగులు పెడుతూ నడుములు విరిగినదానిలా నేలమీద చతికిలబడిపోయింది. రెండు చేతుల్లో బ్యాగులు మోసుకుంటూ మెట్లెక్కి వస్తున్న పార్థసారధి పిల్లలు లోపల్నుంచి రామలక్ష్మి కేకలు విని ఖంగారుగా ''ఏమైంది...ఏమైంది'' అంటూ పరుగెత్తుకుని ఇంట్లోకి వచ్చారు. ఒకరివెంట ఒకరు వచ్చిన వాళ్లు కూడా వెర్రికేకలు పెట్టసాగారు.

''ఓరి బాబో! ఓరి నాయనో! కొంప మునిగిందిరా దేవుడా'' అంటూ రామలక్ష్మి శోకం తీస్తోంది.

భర్తకి ప్రమోషన్ రావడం, మద్రాసు, తిరుపతి విహార యాత్ర ఇచ్చిన ఆనందం అంతా క్షణాల్లో హరించుకుపోయింది.

బయట వేసిన తాళాలు వేసినట్లే వున్నాయి. కానీ వెనుక బాత్‌రూమ్ వెంటిలేషన్ కిటికీ వూచలు వంచి వున్నాయి. ఇంట్లో బీరువాలు, అల్మారాలు తెరిచి అన్ని వస్తువులు నేలమీద చిందరవందరగా పడి వున్నాయి. ప్రయాణంలో పోతాయని వెండి కంచాలు, చెంబు, వెండి గిన్నెలు, అందరి వంటి మీద బంగారు నగలు బీరువాలో దాచి తాళం వేసి వెళ్లారు. అవన్నీ మాయమయ్యాయి. వాటితో పాటు టూ ఇన్‌వన్, విసిఆర్, ఖరీదైన క్యాలిక్యులేటర్ లాంటివి కూడా పోయాయి.

వీళ్లు ఊరికి వెళ్లడం పసిగట్టిన దొంగలెవరో గుట్టు చప్పుడు కాకుండా ఇంటి వెనకాల కిటికీలోంచి లోపలికి ప్రవేశించారు. రామలక్ష్మి గొల్లుమంటుంటే పార్థసారధి గయ్యిమన్నాడు.

''నోరు మూసుకో. ఇది నీ ఘనకార్యమే. నీకెన్నిసార్లు చెప్పినా వినకుండా బాల్కనీ గోడ మీంచి ఎదురింటి వాళ్లతోటి, పక్కింటి వాళ్లతోటి, రోడ్డు మీద పోయే వాళ్లతోటి ఇంటి విషయాలు మాట్లాడతావ్. అడిగినవాళ్లకి, అడగని వాళ్లకి వారం రోజుల్నుంచి మన తిరుపతి ప్రయాణం గురించి చెప్పావు. ఈ విషయం ఏ దొంగ వెధవ చెవినో పడి వుంటుంది. జాగ్రత్తగా గుట్టుగా వుండాలని నీకెన్నిసార్లు చెప్పినా విన్నావా?'' అన్నాడు కసురుతూ.

అయితే నిజంగా జరిగింది కూడా అదే.

ఎందుకంటే రామలక్ష్మి తిరుపతి వెళ్లే ముందురోజు పేపర్లు, పాలకవర్ల కుర్రాడు ఆ మర్నాటి నుంచి ఆ వీధిలో మళ్లీ కనిపిస్తే ఒట్టు!

★